# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 19-01-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- స్విట్జర్లాండ్ లో పర్యటిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దావోస్ లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొననున్నారు.
- రైతులకు కనీస మద్దతు ధర అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు.
- పశుసంవర్ధక రంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు బలమైన ఆధారమని వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు.
- రాష్ట్ర వైద్య మండలికి వచ్చేనెల 9న ఎన్నికలను నిర్వహించనున్నామని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చక్రధరబాబు తెలిపారు.

====================

దావోస్ లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్విట్జర్లాండ్ లోని జ్యూరిచ్ చేరుకున్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు లక్ష్యంగా ఈరోజు పలు సంస్థల ప్రతినిధులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. స్విట్జర్లాండ్ భారత రాయబారి మృదుల్ కుమార్ తో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ తో కలసి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులు పెట్టేలా స్విట్జర్లాండ్ కంపెనీలతో సంప్రదింపులు జరిపేందుకు సహకరించాలని మృదుల్ కుమార్ ను ముఖ్యమంత్రి కోరారు. మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ, స్విట్జర్లాండ్ తో వాణిజ్య సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ఆసక్తిగా ఉందని చెప్పారు. ఇందుకోసం స్విస్ కంపెనీలకు ఆహ్వానం పలుకుతున్నామన్నారు. అలాగే.. ఈరోస్ ఇన్నోవేషన్ సంస్థ చైర్మన్ కిషోర్ లుల్లాతో జరిగిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌ను ఏఐ ఆధారిత సృజనాత్మక సంస్థలకు కేంద్రంగా అభివృద్ధి చేయడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి తెలిపారు. అందుకు తమ సహాయ సహకారాలను అందివాలని కోరారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా డిజిటల్ మీడియా, వర్చువల్ ప్రొడక్షన్, గేమింగ్, యానిమేషన్, ఫిల్మ్ టెక్నాలజీ రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నట్టు ముఖ్యమంత్రి ఈరోస్ సంస్థ ప్రతినిధులకు వివరించారు. అనంతరం జరిగిన తెలుగు డయాస్పోరాలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు.

====================

రైతులకు కనీస మద్దతు ధర అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. విజయవాడ కానూరు పౌర సరఫరాల శాఖ భవన్‌లో ధాన్యం కొనుగోలు అంశంపై అధికారులతో మంత్రి ఈరోజు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రభుత్వం విజయవంతంగా నిర్వహిస్తోందన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ లో ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యానికి 24 గంటల్లోపే 94 శాతం నగదును రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేశామన్నారు. ఇకపై ఉదయం ధాన్యం కొనుగోలు జరిగితే అదే రోజు సాయంత్రం రైతు ఖాతాలో నగదు జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు ఎదురైన లోపాలను సమీక్షించి, రాబోయే రబీ సీజన్‌కు పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని అధికారులకు సూచించారు. త్వరలో తిరుపతిలో రబీ సీజన్ కు సంబంధించి శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు.

====================

పశుసంవర్ధక రంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు బలమైన ఆధారమని వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. విజయవాడ రూరల్ మండలంలోని నిడమానూరు గ్రామంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాల కార్యక్రమాన్ని మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పశుపోషణ రైతులకు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న నేపథ్యంలో పశువుల ఆరోగ్య సంరక్షణకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని పశుపాలకులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం, పశువులకు వ్యాధులు రాకుండా ముందస్తు చికిత్సలు చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టిందన్నారు. పశువులకు ఉచిత వైద్య సేవలు, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందుల పంపిణీతో పాటు శాస్త్రీయ పశు యాజమాన్యంపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పశుపోషకులకు పూర్తి భరోసా కల్పించేలా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు వివరిస్తూ...

(వాయిస్...30 సెకన్లు)

====================

విరామం

====================

రాష్ట్ర వైద్య మండలి (ఏపీ మెడికల్ కౌన్సెల్) సభ్యుల ఎంపిక కోసం వచ్చేనెల 9న ఆన్లైన్ ద్వారా ఎన్నికలను నిర్వహించనున్నామని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చక్రధర బాబు వెల్లడించారు. వైద్య మండలి చట్టంలో సెక్షన్ 3(2) (బి) కింద నిర్దేశించిన 13 మంది సభ్యుల ఎంపిక కోసం ఎన్నికల నోటిఫికేషన్ ను ఈరోజు జారీ చేశామని తెలిపారు. డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (DHS) ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో చక్రధరబాబు మాట్లాడుతూ, హైకోర్టు ఆదేశాలను అనుసరించి వైద్య మండలిలో సభ్యుల ఎంపిక కోసం ఎన్నికలు నిర్వహించబోతున్నామని చెప్పారు. చివరిగా 2006లో ఎన్నికలు జరిగాయన్నారు. 55,504 మంది వైద్యులకు ఓటు హక్కు ఉందని తెలిపారు. అర్హత కలిగిన వైద్యులు ఎక్కడి నుండైనా ఓటు హక్కు వినియోగించుకోవడానికి అవకాశం ఉందని చక్రధర బాబు వివరిస్తూ...

(వాయిస్...30 సెకన్లు)

====================

యోగి వేమన జయంతి ఉత్సవాలను ప్రతి సంవత్సరం జనవరి 19న రాష్ట్ర పండుగగా ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పేర్కొన్నారు. వేమన జయంతి సందర్భంగా ఆయన అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో యోగి వేమన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ, యోగి వేమన పేరు తెలియని తెలుగువారుండరని అన్నారు.

====================

విదేశాలలో పనులకు వెళ్లే వలస కూలీలకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్  కార్యాలయంలో ఏర్పాటు చేసిన కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ కేంద్రం ఓ అశాదీపంలా మారింది. బతుకు తెరువుకు ఏజెంట్ల ద్వారా విదేశాలకు వెళ్లి, మోసపోయిన వారి కోసం ఏర్పాటుచేసిన కెసిఎం కేంద్రం ఎంతో ఉపయోగకరంగా మారింది. జిల్లాలోని ఉప్పలగుప్తం మండలం విలసవిల్లికి చెందిన పశ్చిమాల వెంకటలక్ష్మి తన భర్త చనిపోవటంతో కుటుంబ పోషణ కోసం ఆరునెలల క్రితం కతార్ దేశానికి వలస వెళ్లింది. తిరిగివచ్చేందుకు ఏజెంట్ రెండు లక్షల రూపాయలు డిమాండ్ చేశారని తెలిపింది. దీంతో ఆమె సోదరుడు.. జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ను ఆశ్రయించడంతో ఆయన సూచనల మేరకు కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ కేంద్రం ద్వారా తిరిగి స్వగ్రామానికి వచ్చానని వెంకటలక్ష్మి వివరిస్తూ...

(వాయిస్...22 సెకన్లు)

====================

====================